నమోదులో పొరపాట్లకు తావివ్వొద్దు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సమగ్ర కుటుంబ సర్వేపై వీడియో కాన్ఫరెన్స్

వీసీలో పాల్గొన్న వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జోగుళాంబ గద్వాల అదనపు కలెక్టర్లు

గద్వాల, నవంబర్ 24: సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుందని సర్వే డేటా ఎంట్రీ చాలా కీలకమైందని ఎలాంటి పొరపాట్లకు అస్కారం ఇవ్వొద్దని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సూచించారు. ఆదివారం జార్ఖండ్‌లోని రాంచి నుంచి సమగ్ర కుటుంబ సర్వేపై కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వే డేటా ఎంట్రీ చాలా ముఖ్యమైనదని ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్‌లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తాయి కాబట్టి వారికి ఫోన్ చేసి సర్వే గురించి తెలియజేయడంతో ఆ వివరాలను క్రమబద్ధీకరించుకునేందుకు అందుబాటులో ఉండమని కోరాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు వెళ్లిన వారి వివరాలను జాగ్రత్తగా క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. కొన్ని వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఫుడ్‌పాయిజన్ కేసులు నమోదవుతున్నాయని ఆయా పాఠశాలల్లో ఆహారం, పరిశుభ్రతపై ప్రధానంగా సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ విషయాలపై అధికారులు తగుచర్యలు తీసుకోవాలన్నారు. అపరిశుభ్రతకు తావులేకుండా కార్యచరణ, ప్రణాళిక రూపొందించడానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. సర్వే పకడ్బందీగా చేస్తున్నామని, అధికారులు పాఠశాలలు తనిఖీ చేసి భోజనంలోని నాణ్యతను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ చేయాలి

వనపర్తి టౌన్, నవంబర్ 24: సమగ్ర కుటుంబ సర్వే సమయంలో ఇళ్ల వద్దలేని, వలసలు వెళ్లిన వారికి ఫోన్ చేసి వివరాలను జాగ్రత్తగా, క్రమబద్ధీకరణ చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వెల్లడించారని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం ఆదివారం జిల్లా అధికారులతో సమగ్ర కుటుంబ సర్వేపై వీసీద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. సర్వే సమయంలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటివద్ద అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు తలెత్తాయని వారికి ఫోన్ చేసి వివరాలను వెల్లడించేలా ఎన్యుమరేటర్లకు ఆదేశించాలని చెప్పారు. సర్వే డేటా ఎంట్రీ నాణ్యత చాలా ముఖ్యమైనదని, ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు.

కార్తీక వనభోజనంలో పాల్గొన్న మాజీ మంత్రి

వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, నవంబర్ 24: జిల్లా కేంద్రంలోని 29వ వార్డు కౌన్సిలర్ భారతి ప్రేమ్‌నాథ్ దంపతులు నిర్వహించిన వన భోజన కార్యక్రమానికి ఆదివారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా వారి పెళ్లి రోజును పురస్కరించుకొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కాలనీవాసులంతా ఆప్యాయంగా వనభోజనం చేయడం సంతోషకరమన్నారు. అదేవిధంగా వనపర్తికి చెందిన గోనూరు యాదగిరి ఇటీవల మృతిచెందడంతో ఆదివారం నిర్వహించిన దశదినకర్మకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యాన్నిచ్చారు. అదేవిధంగా పట్టణానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు క్రాంతి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వనపర్తి పట్టణానికి చెందిన బురాన్ కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వేణుగోపాల్, మహేశ్వర్‌రెడ్డి, ఆరీఫ్, పాషా, సయ్యద్, జమిల్, రాము, అశోక్, రమేశ్‌గౌడ్, కృష్ణ, మాణిక్యం, గిరి, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగాభవానీ ఉత్సవాలకు ఆహ్వానం

ఎమ్మెల్యేకు ఆహ్వానం పలుకుతున్న రాజోళి గ్రామపెద్దలు

రాజోళి, నవంబర్ 24: మండల కేంద్రంలో వెలిసిన గంగంభవానీ ఆలయంలో మంగళవారం నుంచి నిర్వహించనున్న ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే విజయుడుకు ముదిరాజ్ సంఘం పెద్దలు ఆదివారం ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు ప్రజల సంబంధాలను పెంచుతాయని ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు.

ప్రైవేటీకరణను నిలిపివేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

వనపర్తి టౌన్, నవంబర్ 24: మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైవేటీకరణ, రైతు వ్యతిరేక విధానాలను నిలిపివేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అన్ని పంటలకు మద్దతు ధర, వ్యవసాయ ఖర్చులు 50శాతం అదనంగా జోడించి అమలు చేయాలని, నాలుగు కార్మిక చట్టాలను ఉపసంహరించి కనీస వేతనం, ఉద్యోగ, సామాజిక భద్రత, 8గంటల పనిదినం, ట్రేడ్ యూనియన్ హక్కులను పునరుద్ధరించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మికుల, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ఈనెల 26న నిరసన కార్యక్రమాలు దేశవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. నిత్యావసర ధరలు పెరుగుతున్నాయని.. వాటిని అదుపు చేయాలని కోరారు. ప్రైవేటీకరణను ఆపాలని, కార్మికులకు నెలకు రూ.26వేల కనీస వేతనం, రూ.10వేల పింఛన్, విద్యుత్ మీటర్ల చట్టబద్ధత, పంటల బీమాను అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సమావేశంలో ప్రగతిశీల రైతు సంఘం అధ్యక్షుడు రాజన్న, వెంకటయ్య, ప్రసాద్, బాలయ్య, మురళి, కురుమన్న, బాలస్వామి ఉన్నారు.

గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలపై సన్నాహక సమావేశం

సన్నాహక సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

వనపర్తి టౌన్, నవంబర్ 24: ఆర్ఎల్‌డీ డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలపై హైదరాబాద్‌లోని హస్తినాపురంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు సమావేశమై అప్పటి అధ్యాపకులు బీఎల్ఎన్ మూర్తి, అధ్యాపకురాలు జయంతి, మొదటి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు అన్ని బ్యాచ్‌లకు చెందిన వారు కలిసి సావనీరు కల్చరల్, అకాడమీ కమిటీ, ఆహ్వాన కమిటీ తదితర నిర్వహణ అంశాలపై చర్చించారు. తదుపరి సమావేశం వనపర్తిలో నిర్వహించాలని నిర్ణయించారు. పూర్వ విద్యార్థులు లక్ష్మీనారాయణ, యుగంధర్‌రెడ్డి, రాజు, శ్రీనివాసులు, బాలస్వామి, రమాకాంత్, అరుణ్‌కుమార్, కిరణ్‌కుమార్, సత్తార్, కోటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సూర్యచంద్రారెడ్డి హాజరయ్యారు.

సీసీకెమెరాలపై అవగాహన

రేవల్లి, అక్టోబర్ 24: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సై రాము ఆధ్వర్యంలో సీసీకెమెరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ కెమెరాలు ఉంటే దొంగతనాలను అరికట్టవచ్చని తెలిపారు. అందరూ కలసి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేశభక్తి పెంపునకు ఎన్‌సీసీ తోడ్పాటు

గద్వాలటౌన్, నవంబర్ 24: ఎన్‌సీసీలో చేరడంతో క్రమశిక్షణతోపాటు విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందుతుందని పాఠశాల పూర్వ విద్యార్థి, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మహేందర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 77వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా ఎన్‌సీసీ విద్యార్థులు పరేడ్ నిర్వహించారు. అలాగే వివిధ విన్యాసాలు ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. నాయకత్వ లక్షణాలు, సేవా తత్వాన్ని పెంపొందించడంలో ఎన్‌సీసీ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. నవతరాన్ని సమాజ సేవకులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలకమైందని చెప్పారు. మరిన్ని పాఠశాలల్లో ఎన్‌సీసీని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. తాను చదవుకున్న పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో పాలు పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇమ్మానియేల్, ఎన్‌సీసీ ఇన్‌చార్జి సమరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఎస్పీ మహేందర్

వందనం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

కుర్వ సంఘం జిల్లా కార్యవర్గం

గద్వాల రూరల్, నవంబర్ 24: జిల్లా కేంద్రంలోని ఓఫంక్షన్ హాల్‌లో ఆదివారం కుర్వ సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సతీశ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కుర్వ పల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కుర్వల ఐక్యతకు అందరూ తోడ్పాటు అందించాలని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కుర్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, నాగరాజు, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, బుచ్చన్న, కృష్ణ, శ్రీనివాసులు, రామచంద్రుడు, శ్రీహరి, రాజశేఖర్, ఎల్లప్ప, క్రాంతి, రవి, శ్రీనివాసులు, ఈశ్వర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సందెరాళ్ల విజేతలకు బహుమతులు

విజేతలకు నగదును అందజేస్తున్న నిర్వాహకులు

గట్టు, నవంబర్ 24: అంబాభవానీ జాతర సందర్భంగా ఆదివారం నిర్వహించిన సందెరాళ్లు ఎత్తే పోటీలు ఆసక్తిగా సాగాయి. ప్రథమ విజేతగా నాగర్‌దొడ్డి ప్రతాప్, ద్వితీయ విజేతగా కున్సి నర్సింహులు, తృతీయ విజేతగా గుడేబల్లూరు సూరి, నాలుగో విజేతగా గుంజేపల్లి అంజి నిలిచారు. విజేతలకు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు, రూ.3వేలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, కృష్ణ, రాజు, సంతోష్, బజారి, రంగస్వామి, సుదర్శన్‌రెడ్డి, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

శాకాహారమే ముద్దు

వనపర్తి టౌన్, నవంబర్ 24: బ్రహ్మర్షి పితామహ పత్రీజి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో శాకాహార

ర్యాలీలో పాల్గొన్న శాకాహారులు

ర్యాలీని నిర్వహించారు. ర్యాలీ కొత్తబస్టాండ్ మీదుగా రాజీవ్ చౌక్, ఇందిరాపార్కు, అంబేద్కర్‌చౌక్ మీదుగా కొనసాగింది. మాంసాహారం వద్దు–శాకాహారం ముద్దు అంటూ ప్లకార్డులు, క్యాప్‌లు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. జీవహింస మహా పాపం, మాంసాహారం పాప ఆహారం, దేవుళ్లందరి మార్గం అహింసా మార్గం, మాంసాహారం 8 రకాలని నినాదాలు చేశారు. బ్రహ్మర్షి పత్రీజి శాఖ సభ్యులు మాట్లాడుతూ.. పత్రీజి ఆశయం కోసం శాకాహారం భుజిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పత్రీజి శాఖ పట్టణ అధ్యక్షుడు ఉమేశ్‌గౌడ్, స్వర్ణలతారెడ్డి, తిరుపతయ్య, సత్యనారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, నర్సింహాయాదవ్, మధుమోహన్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, సునీత, శైలజ, సరిత, ప్రవీణ్, వేణుగోపాల్, రాములు, జయంత్ ఉన్నారు.

మతసామరస్యాన్ని కాపాడుకుందాం

వనపర్తి టౌన్, నవంబర్ 24: మతోన్మాద శక్తుల నుంచి తెలంగాణను దక్కించుకున్నామని, శ్రామికుల ఐక్యతతో బలోపేతం చేద్దామని, మతసామరస్యాన్ని కాపాడుకుందామని, లౌకికరాజ్యాన్ని రక్షించుకుందామని సీపీఎం నాయకులు బాల్‌రెడ్డి, ఆంజనేయులు, సీపీఐఎంఎల్ నాయకులు రమేశ్, గణేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో ఆదివారం సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ వామపక్ష పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మతోన్మాద వ్యతిరేక జిల్లా సదస్సుకు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చాక మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ, మతం పేరుతో మనుషులను విడదీస్తున్నారని, మెజార్టీ ఓటు బ్యాంకుగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. పెరిగిన నిత్యావసర ధరలు, ఉపాధి సమస్యలు, నిరుద్యోగంతో సతమతమవుతుంటే వారిని పట్టించుకోకుండా మతపరమైన ఎజెండాను ముందుకు తెస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తయినా పునర్విభజన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. కేంద్ర మంత్రులు మన రాష్ట్రానికి నిధులు, అభివృద్ధి పథకాలు తేవాల్సింది పోయి మత విభజన చట్టాన్ని తయారు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో దళితులపై 120 కుల దురహకార హత్యలు జరిగితే సంఘ్ పరివార్ శక్తులు నాగరాజు హత్య విషయంలో ముస్లింలు నేరస్తులని హిందు, ముస్లిం మధ్య ఘర్షణ వాతావరణం సృష్టించిందన్నారు. రాబోయే కాలంలో వామపక్షాల ఆధ్వర్యంలో మరింత ప్రజా పోరాటాలు, ఉద్యమాలు ఉధృతం చేస్తామని పిలుపునిచ్చారు. అలాగే వివిధ పార్టీల రాష్ట్ర నాయకులు విజయరాములు, హనుమంతు, ఎండీ జబ్బార్ హాజరై ప్రసంగించారు. సమావేశంలో వామపక్ష నాయకులు కళావతమ్మ, రవీందర్, మోషే, చిన్న కుర్మయ్య, లక్ష్మీనారాయణ, లక్ష్మి, రాజు, గోపి, పరమేశ్వరాచారి, ఆంజనేయులు, రమేశ్, వెంకటయ్య, మహబూబ్‌పాషా, రాజు, రాజన్న పాల్గొన్నారు.

సదస్సులో ఐక్యతను చాటుతున్న వామపక్షాల నాయకులు

హిందూ చైతన్య యాత్ర ప్రారంభం

అయిజ, నవంబర్ 24: పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి ఆలయం నుంచి ధర్మజాగరణ సమతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందూ చైతన్య యాత్ర ఆదివారం ప్రారంభించారు. పరిపూర్ణమైన జీవన విధానం హిందూ సంప్రదాయాల్లో ఉందని, యావత్ ప్రపంచం సనాతన ధర్మం అనుసరిస్తున్న భారత్ వైపు చూస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. భవిష్యత్ తరాలు హిందూ సంప్రదాయాలను పాటిస్తే సమసమాజ హితం ప్రకృతి పరమైన జీవన విధానం అలవర్చుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ పాలమూరు విభాగ ధర్మ జాగరణ ప్రముఖ్ లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో ఈనెల 11న మద్దూర్ మండలంలో ప్రారంభమైన యాత్ర అచ్చంపేట మండలంలోని మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి, తిమ్మప్ప, విజయ్, భగత్‌రెడ్డి, లక్ష్మన్న గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి మండలంలో..

వడ్డేపల్లి, నవంబర్ 24: హిందూ చైతన్య రథయాత్రకు జూలేకల్, వెంకట్రామనగర్, వడ్డేపల్లి గ్రామప్రజలు స్వాగతం పలికారు. హిందూ ధర్మం ప్రాచీనమైనదని, మత యుద్ధాలు అవసరం లేదని యువకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శేఖర్, గోపాల్, వెంకట్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

అయిజలో రథయాత్రను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

జూలేకల్‌లో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కేంద్రం వ్యతిరేక విధానాలను ఎండగడుతాం

అయిజ, నవంబర్ 24: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నర్సింహ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఈనెల 26న జిల్లా కేంద్రంలో జరిగే దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రైతు, వ్యవసాయ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, కార్పొరేట్ ప్రయోజనాల కోసం ప్రభుత్వ రంగసంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు తాకట్టు పెడుతుందన్నారు. ఇప్పటికే దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసిందన్నారు. వ్యవసాయ రంగాన్ని నాశనం చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈనెల 26న జరిగే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్యక్రమాల్లో సీఐటీయూ నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మల్లేశ్, నాగరాజు, గిద్దలప్ప, మహేంద్ర, లింగన్న, వెంకటేశ్, పరమేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ కార్యదర్శి నర్సింహ

అలంపూర్ ఆలయాల్లో ప్రముఖులు


సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జికి స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

అలంపూర్ చౌరస్తా, నవంబర్ 24: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో భక్తులు రద్దీ నెలకొంది. ఆదివారం సెలువు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి, రిటైర్డ్ చైర్మన్ లోక్‌పాల్ ఇండియా, ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎంక్వైరీ కమిషన్ చైర్మన్ పినాకి చంద్రగోష్ ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు.

దళారులపై రైతుల ఆగ్రహం

అలంపూర్ చౌరస్తా, నవంబర్ 24: పత్తి రైతులను దళారులు, కొనుగోలుదారులు దోచుకుంటున్నారని పత్తి రైతులు ఆగ్రహించిన ఘటన అలంపూర్ మండలం బుక్కాపురంలో చోటుచేసుకున్నది. ఆదివారం గ్రామంలో పత్తి కొనుగోలుదారులు, దళారులు చేతివాటం చూపిస్తున్నారని, క్వింటా పత్తికి 10కేజీల వరకు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎలక్ట్రిక్ కాంటాతో రైతులను మోసం చేస్తున్నారని, ఎన్నిరోజుల నుంచి మోసం చేస్తున్నారంటూ కొనుగోలుదారులపై ఆగ్రహించడంతో వ్యాపారులు పారిపోయారు. దీంతో అలంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేశామని రైతులు తెలిపారు.

మహాభాగవత సప్తాహం

మల్దకల్, నవంబర్ 24: మండలంలోని ఎద్దుల గూడెం ఆంజనేయ స్వామి ఆలయంలో జిల్లా వికాస తరంగణి ఆధ్వర్యంలో మహాభాగవత సప్తాహం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం 50మంది శ్రీమన్నారాయణ రామానూజ చిన్నజీయర్ స్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో పారాయణ కార్యక్రమంతోపాటు భాగవత సప్తాహం ఆలపించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వీపనగండ్ల, నవంబర్ 24: జిల్లా కేంద్రంలో నిర్వహించిన 52వ జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, ఇన్‌స్పైర్ కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు గౌతమ్ చక్రి, చరణ్ ట్రాన్స్‌ఫోర్టు కమ్యూనికేషన్ విభాగంలో ప్రతిభ చాటడంపై జీహెచ్ఎం భానుప్రకాశ్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులతో పాటు గైడ్‌గా వ్యవహరించిన సైన్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మహేశ్‌ను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సైన్స్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థులు ప్రతిభ చాటేవిధంగా ఉపాధ్యాయ బృందం కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి విద్యార్థులు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

కరాటే జిల్లా కార్యవర్గంలో చోటు

మదనాపురం, నవంబర్ 24: వనపర్తి జిల్లా కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గంలో కొత్తకోట (గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోకాన్ కరాటే ఇండియా)కు చెందిన మాస్టర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ ఆదివారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులు శంకర్‌నాయక్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా కొత్తకోట మండలం కనిమెట్టకు చెందిన పరమేశ్, మదనాపురం మండల కేంద్రానికి చెందిన శివరాజ్, ఆర్గనైజర్ సెక్రటరీలుగా జాఫర్, సాధిక్, హరీశ్‌యాదవ్, జాయింట్ సెక్రటరీలు కైసర్, సుమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

జిల్లా కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర కమిటీ సభ్యుడు శంకర్‌నాయక్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE
★LUXURIOUS INDEPENDENT HOUSE FOR SALE AT YENUGONDA, G+1. 150 Sq.Yrds., Prime location, secure neighborhood, all the essential amenities located nearby. Price : 1 crore, **Contact: 9966698792, 9505506523.**
NT- MBNR

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748